# ముందుకథ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

## ౧

శారదాచట్టం ఆరంభించబోయేముందు జరిగిన పెండ్లిండ్ల ప్రళయంలో పరమనైష్ఠికులైన పేరిశాస్త్రిగారు రానున్న కులహానికి భయపడి కట్టుతప్పిన పిల్లకువలెనే కంగారుపడి యేడాదిపిల్లయిన కామేశ్వరిని యేడేండ్లవాడగు శేషగిరి కిచ్చి ముడివేశారు. పెండ్లికి మూగిన జనులసందడికీ పురోహితుల మంత్రపురోదకూ బాజాల చప్పుడుకూ పిల్ల అదిరిపోయి పోరుపెట్టి యేడుస్తున్నా పాపం తల్లిఅయిన అన్నమ్మగారు చాలావోర్పుతో బిడ్డకు పాలిస్తూ మూడుముళ్లూ వేయించింది. ఆపెండ్లయినా ఒకరోజు పెండ్లి కాదు. అయిదురోజులూ సలక్షణంగా జరిగినది. అన్నమ్మగారికి చిన్ననాటి పెండ్లి ముచ్చటలన్నీ కూతురుమూలకంగా మళ్లీ అమరినాయి. ఈ వివాహంలో శేషగిరి కట్నం ఒక పట్టులాగూ పట్టుకోటూ; కామేశ్వరికి సొమ్ము గ్రుక్కెడు తల్లిపాలు. అది శాస్త్రీయమైన నగ్నికావివాహం కాబట్టి, పెండ్లికూతురు తల్లికే గాని, పెండ్లికూతురుకి చీరె, రవికల, చదివింపులు అవసరం లేకపోయింది. పేరిశాస్త్రిగారు, సాలంకృతకన్యాదానం చేసి పితృదేవతల తరింపజేయనెంచిన నిష్ఠాగరిష్ఠుడు కాబట్టి పిల్లకు పెట్టవలసిన నగలనుగూర్చి కాని, అడిత్రరనపెళ్లినుగూర్చి కాని ప్రస్తావనైనా చేయలేదు. మెడలోగట్టిన పుస్తెబొందుకూ మొగానకట్టిన బాసికప్రత్తాడుకూ చీకాకుపడి కామేశ్వరి యేడ్చేది. వీటికి తోడు పూటపూటా అగ్నిహోత్రందగ్గర పొగా. దీనికి భయపడి కామేశ్వరి కాకుండా శేషగిరికూడా కలిమి అరుగుదగ్గరికి రానని యేడ్చేవాడు. బుజ్జగింపో, మందలింపో, వట్లాగోట్లా సమాధానపెట్టి కళ్ల నీళ్లు తుడిచి తండ్రి ఔపాసనం చేయిస్తూ ఉండేవాడు. ఏమయితేనేమి పెండ్లి సలక్షణంగా అంటే మేజువాణీ, ఊరేగింపూ పానుప్పు అప్పగింతలు దండాసింపూ గైరా లే లోటూ లేకుండా యథావిధిగా జరిగింది. ఆగ్రామంలోని బ్రాహ్మణులయిండ్లలో ఆఅయిదురోజులు పొయ్యి రాజెయ్యలేదు ఈ విధంగా అన్నదానం చేసి పేరిశాస్త్రిగారు ధన్యులైనారు. చేసుకొనేవాళ్ల ముచ్చటెట్లాఉన్నా చేసేవాళ్ల ముచ్చటా చూచేవాళ్ల ముచ్చటా బాగాతీరింది. దివ్యమైన యీపుత్రికా వివాహం జరిపి రానున్న ఉపద్రవం నుండి రక్షింపబడితినిగదా అని పేరిశాస్త్రిగారు ముదితులైనారు.

## ౨

శేషగిరితండ్రి సుబ్బయ్య దీక్షితులు గుంటూరి స్కూలులో తెలుగుపండితుడు. వైదికవాసన పూర్తిగాపోక పిల్లవాడికి పెండ్లిచేశాడు గాని లౌకికవృత్తి అంటే ఆయనకు మహామోజు. ఏనాటికైనా తనకొమారుణ్ణి బి. ఏ., బి. యల్. చదివించి వాకిట్లో బల్లకట్టించాలనని ఆయనకోరిక. కాబట్టి మడిమాన్యాలు తెగనమ్మైనా శేషగిరికి యింగ్లీషు చదువు చెప్పించడానికి పూనుకొన్నాడు. సహజంగా తెలివిగలవాడైన శేషగిరి ఒక్కక్లాసూతప్పకుండా రొక్కివచ్చి ఇరవై యేండ్లు వచ్చేటప్పటికి బియ్యేప్యాసై తండ్రిని సంతోషసాగరంలో ఓలలాడించాడు. వెంటనే సుబ్బయ్య దీక్షితులుగారు మహోత్సాహం జెంది తన యీప్సితార్థమైన లాచదువు సాధించడానికి శేషగిరిని చెన్నపురి పంపించారు.

శేషగిరికి చిన్నప్పటినుండి నవనాగరికతయందు మోహమెక్కువ. దానికి తగినట్టుగా సాహితీసమితిసభ్యులతో ఆతనికి సహవాసం. వారి నిరంతరజ్యోత్స్నల్ల ప్రణయగీతాలల్లడం ప్రకృతిశోభనాస్వాదించడం నేర్చుకొన్నాడు. కాని అతను పుట్టింది మొదలు గుంటూరులోనే ఉండి తల్లిదండ్రుల ప్రాపున చదువుకొన్నవాడు కాబట్టి అతని నవీనభావాలింకా విపులంగా విస్తరించడానికి వీలుకాలేదు.

చెన్నపురి దర్శనం ఆతనికి క్రొత్త. కాన, అప్పటి వింతలకూ, వినోదాలకూ ముగ్ధుడై తని[illegible]త్తితో

చూచినది చూడకుండా చూస్తున్నాడు. చూడంజూడ ఆతనికి ప్రపంచమంతా మారిపోయినట్లు తోచింది. శారదాచట్టంతో బాల్యవివాహాలు నిషేధింపబడటంచేత బాలికలు తండోపతండములుగా పాఠశాలలో జేరి బాలకులతో సమంగా చదువుతున్నారు. వాండ్ల ముఖోల్లాసమూ, చాకచక్యమూ, తెలివితేటలూ వినయవిధేయతలూ చూస్తే అద్భుతంగా జూపట్టినవి. తనసహపాఠులైన వారిలో అనేకు లట్టి వయోవిద్యారూపగుణగణ్యలైన కన్యలను వివాహమాడడం గూడా శేషగిరి కొన్నిచోట్ల చూచాడు. తన బాల్యవివాహంతో అలనాటి వివాహాలు పోల్చి చూచుకొని లోలోపల సిగ్గుపడ్డాడు. తనకు పెండ్లయినసంగతి యెవరికీ చెప్పగూడదనుకున్నాడు. అప్పటికీ జంకుతీరక తనజందెంతీసి మొలలో దోపుకోటం మొదలుపెట్టాడు. ఈవిధంగా మొదటియేడు గడచిపోయింది. శేషగిరి ఎఫ్. యల్. క్లాసులో నెగ్గి బి. యల్. క్లాసులో ప్రవేశించాడు. ఈప్రవేశించిన కొన్నాళ్లకే కామేశ్వరి రజస్వలై రెండేండ్లయింది. ఇంకా ఆపడం భావ్యంగాలేదు. కాన ఈశ్రావణశుద్ధ దశమి, నిషేకమునకు సుముహూర్తము నిర్ణయించినాము. నీవు అప్పటికి సెలవు తీసుకొని రావలసినదని తండ్రివద్దనుండి శేషగిరికి ఉత్తరం వచ్చింది.

## ౩

కామేశ్వరి రూపసి కాదు. దానికి తగినట్లుగా పెండ్లయిన ఆఱునెల్లకే వచ్చిన చిన్నబిడ్డగుణంవల్లా ఆమె ఉసరేడు వచ్చిన స్ఫోటకంవల్లా, ఆమెమొఖాన కొన్ని మచ్చలు పడ్డాయి. ఇట్టి నైమిత్తికాలవల్ల కొన్ని వికారాలు యేర్పడ్డా దైవానుగ్రహంవల్ల బాలారిష్టాలన్నీ గడిచి పెద్దదైంది. కాని సృష్టియొక్క నైజంచేత ఒకయేడుకంటె మరొకయేటికి కామేశ్వరి ఆకృతియందు పెద్దదగుచున్నప్పటికీ అవయవస్ఫూర్తి చెందుచున్నప్పటికీ వయోభివృద్ధివల్ల నిజంగా మనిషి పొందవలసిన విద్యావివేకములూ లోకజ్ఞానమూ వగైరా లేమీ కామేశ్వరికి కలుగలేదు. నాగరికపు స్త్రీప్రపంచంలో జరుగుచున్న వేషభాషలమార్పులూ, విద్యావికాసాలూ ఆమె అజ్ఞానపు హృదయంలో కించిత్తుచోటునైనా ఆక్రమించలేదు. తండ్రిఛాందసమూ తల్లి మౌఢ్యమూ ఆమెను యుగధర్మాన్ని కెడంగా జేసివైచినవి. శేషగిరిలో జరుగుచున్న విద్యాభివృద్ధి చూచైనా కొమార్తెకు కొంచెం అక్షరజ్ఞానం కలిగింతామనే తలంపు తల్లిదండ్రులకు తోచలేదు. ఎట్లాగో ఒకడి కిచ్చి ముడివేశాముగదా ఇక పరవా లేదనుకొన్నారు. అంతేగాకుండా ఆడదానికి చదువు చెప్పించడంవల్లనే యీవిపరీతపు వికృతపు మితశాసనాలు పుట్టడానికి కారణమనీ ఆడది హద్దుమీఱకుండా ఉండడానికి సాధ్యమైనంతవఱకూ ఆడదాన్ని అడగద్రొక్కి ఉంచడమే మంచిదనీ పేరిశాస్త్రిగారి అభిప్రాయం కాబట్టి యీరెండు కారణాలవల్లా కామేశ్వరి ఒకమౌఢ్యలోకంలో పెరిగింది. ఏమయితేనేమి యుక్తవయస్కురాలైంది గనుక యిక యింట్లో ఉంచుకోడం ఉచితంగాదని పేరిశాస్త్రిగారు నిశ్చయించుకొని వియ్యంకుడికి ఒకఉత్తరం వ్రాశారు. దానికి జబాబు రాకపోతే మళ్లీ వ్రాశారు. ఇక ఉపేక్షకూడదని సుబ్బయ్య దీక్షితులుగారు కొమారుడికి ఉత్తరం వ్రాశారు.

## ౪

ఆఉత్తరం చూచిందిమొదలు శేషగిరి "నాన్నకు ఏమి సమాధానం వ్రాస్తా"మని పెద్ద యోచనలో పడ్డాడు. ఏడాదిక్రిందటనే ఒకమాఱు కామేశ్వరిని చూచాడు శేషగిరి. అతను వెళ్లేప్పటికి కామేశ్వరి తల్లితోబాటు అంట్లుతోముతూ పెనిమిటి వచ్చాడని కంగారుతో అవతలికి వెళ్లింది. ఆవెళ్లుతూనే ఒకమాటు తలెత్తి పెనిమిటివంక కామేశ్వరికూడా చూచింది. ఆసమయంలో ఎగిడీదిగిడీగా కట్టుకున్న చీరా, మోచేతులంటా తొడుక్కున్న చారల రవికా, ఆరవికకున్న పెద్దమెడపట్టీ, ఆపట్టికి వ్యత్యస్తంగా పెట్టుకున్న పిన్నూ, మెడలో జిగివీలేని పుదుచ్చేరినాన్నూ, చేతులకు పొన్నులవంటి మురుగులూ, ఆమురుగులకు ముందు గుత్తంగా తొడిగించుకున్న నాలుగైదు పట్టుగాజులూ, చెవులకు పెద్దపెద్దకమ్మలూ, చెంపసరాలూ, నడిమిపాపటతీసి గట్టిగా జడల్లుకొని చుట్టుకొన్న బిళ్లచుట్టూ, దానికి యెగువగా ఒకనాగరం,

తెగిన జుట్టు చక్క చేసుకోకపోవడంచేత దుబ్బువలె లేచిన జుట్టూ, ఈవిధముగా ఉన్న భార్యను శేషగిరి బాగాచూచాడు. ఆమెపై ఖరి అతని కేమాత్రం ఆకర్ష కంగా లేదు. అప్రయత్నంగా అతని మనస్సులో భార్య యెడ ఒకవిధమైన అసంతుష్టి గలిగింది. తన బాల్యవివాహం తలచి మనస్సులో కొంచెము సేపు వేదన పడ్డాడు. కాని ఆవేదన యెవరికీ తెలియబడకుండానే తిన్నగా యింటికి వచ్చేశాడు. కాని ఆవైముఖ్యం మాత్రం నానాటికి నవలు కొమ్మలు వేసుకొని వృద్ధిపొందుతూనే ఉన్నది. చెన్నపురి వచ్చినతరువాత నవనవాకార ములతో నవీనశృంగారములతో చెక్కిళ్లపై అరుణదీప్తి, పెదవులపై చిఱునగవులదొంతులూ, లోలలోచనములలో క్రీడానమ్రతలూ తొలకరింప కదల్చినప్పుడెల్లా కాంతులు చిమ్మేచేతిబంగారుగాజుల తళ తళలతో మెదలినప్పుడెల్లా మిలమిలలాడే చెవి లోలాకుల చెంగలింపులతో పృష్ఠభాగానికంతకూ శోభదెచ్చే నిడుపైన వాలుజడతో కంటికద్దములూ, కాళ్లకు స్లిప్పర్లూ, జిలుగైన చీరా, చిన్న చేతుల రవికా మొదలైన నవనాగరికాలంకారములతో తెలుగూ యింగ్లీషు భాషలతో అనర్గళంగా మాట్లాడుకుంటూ సౌందర్యదేవతలవలె సరస్వతీ అవతారములవలె కానుపించే ఆంధ్ర బాలికారత్నములను చాల మందిని చూచాడు. చూచినకొద్ది అతనిమనస్సులో క్రమాభివృద్ధి చెందుతున్న స్వభార్యయందలి వైముఖ్యాంకురం బాగా వృద్ధిపొంది వేళ్లుతన్ని పెళ్లగింపరాని మహావృక్షంగా తయారైంది. కాబట్టి ఆతడు ఉత్తరానికి జబాబు వ్రాయగూడ దనుకున్నాడు. ఇట్లా అనుకుంటూ ఉండగా రెండుమూడురోజులు గడిచిపోయినాయి. తండ్రి వద్దనుండి జబాబువ్రాసినావుకాదేమి? ఆ రోజుకు నీకు రావడానికి వీలవుతుందా కాదా, అవతల వాళ్లు యత్నం చేసుకోవలసి ఉంటుందని మరల ఉత్తరం వచ్చింది.

౨

ఈమాటు సమాధాన మివ్వకతప్పదు, కాని ఏమివ్రాస్తా మనుకున్నమాట తలుచుకుంటే శేషగిరి గుండె గుభేలు మన్నది. ఏడో యేట తనకు పెండ్లికావడ మనేది అతనికొక అవమానంగా ఉండడంచేత మిత్రులతో యీవిషయం ఆలోచించడానికి ఆతనిచిత్త మంగీకరించలేదు. కాబట్టి ఒంటరిగానే యోచిస్తున్నాడు. అందునిమిత్తం ఆటపాటలూ సాయంకాలపుషికారులూ మానుకున్నాడు. తనగదిలో ఒంటరిగా కూర్చున్నాడు. 'ఏడాదిపిల్లకూ ఏడేండ్లపిల్లవాడికీ చేసిన వివాహం శాస్త్రీయ మెట్లా అవుతుంది? తలిదండ్రులు చేసిన యీ అత్యాచారపు వివాహంలో నాబాధ్యతేమున్నది? నే నెందుకు దీనిని అతిక్రమించగూడదు. పసితనంలో అనాలోచితంగా చేయబడ్డ యీవివాహానికి బద్ధుడనై ప్రపంచమెఱుగని ఆమోటుమానిసితో నాజీవిత మేల దుఃఖభాజనం చేసుకోవాలె? దీన్ని అతిక్రమిస్తే నాకెందుకు పాపంవస్తుంది? ఏమీ యెఱుగని పసిపిల్లలమైన మమ్మ కూర్చోబెట్టి వీరి నీఅక్రమపుపెండ్లితంతు జరుపమన్న దెవరు? ఎవరి బాధ్యతతో వా రిట్లా చేశారు? మైనరుఆస్తిని అమ్మడానికీ, అన్యాక్రాంతం చేయడానికీ లా వొప్పుకోదు. వారిమీద ఒకఋణం మోపడానికైనా గార్డియన్‌కు హక్కులేదు. అట్టిచో మైనరుయొక్క వివాహపుహక్కు మాత్రం అట్టిది గాదా? దానిని జాగ్రత్తగా సంరక్షించి ఒప్పగించడం సంరక్షకుల బాధ్యతగాని యిట్టి దుర్వినియోగం న్యాయమా? సరే పోనీ యేదో హడావిడితో చేశారే అనుకో కామేశ్వరికి, చదువెందుకు చెప్పగూడదు? నాగరిక మెందుకు నేర్పగూడదు? ఏదోవిధంగా ముడివేశాము గదా. ఇక నెక్కడికి పోతాడని ధిలాసా కాబోలు. ఈధిలాసా వదిలించడ మెంతసేపుకాని, పాపం ఆ కామేశ్వరిని తలుచుకుంటేమాత్రం కొంత జాలివేస్తున్నది. నేనంటే మగవాణ్ణి గనుక ఎట్లాగో తెగించి పెండ్లి చేసుకుంటాను కాని, అభం శుభం యెఱుగని ఆ అమాయకురాలి గతి యేమికావాలె? డైవోర్సు చట్టం అమల్లో ఉన్నా ఆఛాందసులు పిల్లకు పునర్వివాహం చేస్తారా? ముమ్మాటికీ చేయరు. చేయకపోతే ఆ బాలిక ఉసురు నాకు కొట్టుతుందేమోగదా, ఎట్లే నాకెందుకు కొట్టుతుంది? నేనేమెఱుగుదును? ఆతాళి కొట్టు బొందైనా నేను కట్టానో నాకు చేతకాకపోతే ఆపురోహితుడే కట్టాడో నాకు జ్ఞాపకం లేదు. ఈ

ముశివేసిన ద్రోహమైనా యెఱుగని నాకు ఆపిల్ల ఉసురు యెందుకు కొట్టుతుంది? ఇహజీవితంలో అనుకూలదాంపత్యాలోకం కంటె స్వర్గమేమున్నది? అట్టి ఐహికపరమార్థం పాడుచేసుకొని నాజీవితం దుఃఖభాజనం చేసుకోనా? టట్-వల్లపడదు. కాని మాతండ్రి కేమని సమాధానం? నేనిప్పుడాపిల్లవద్దని వ్రాస్తే మానాన్న యెంత నొచ్చుకుంటాడు? నామాటతో నేశాడు, నాపరువు పోగొట్టాడని యెంత కటకటలు పడ్తాడో గదా, అయ్యో! స్వార్థంకోసం పూజ్యులైన మాతల్లిదండ్రుల ధిక్కరించనా? అయ్యో! నాబ్రతుకు యెటువంటి సంకటస్థితిలో పడ్డది? నాన్నా, నాకిటువంటి పెండ్లిచేసిన వాడవు నా కీచదు వెందుకు చెప్పించావు? ఈవిధమైన యోచనలు మనస్సులో తగిలేకొద్దీ శేషగిరికి కండ్లనిండా నీళ్లు వచ్చినాయి. అనుకూలవతియగు భార్యలేక అల్లాడుతూ బ్రతికి ఉండడంకంటే యీజీవితపుటోడను యీలోకసాగరంనుండి తొలగిస్తే బాగుంటుందేమో అనుకున్నాడు. కాని తాను సుబ్బయ్యదీక్షితులు బుచ్చమ్మగార్ల యేకపుత్రుడు. వాళ్లు తనమీదనే ప్రాణాలు పెట్టుకొని తమ సర్వస్వం విక్రయించి తనకు చదువుచెప్పిస్తూ తానేదో గొప్ప ఉద్యోగంచేస్తే చూడాలని కొండంత ఆశతో యెదురుచూస్తున్నారు. ఇంతకోరికతో ఉన్న తల్లిదండ్రులను యీవార్ధక్యంలో నిండుదుఃఖంలో ముంచిపోవడం న్యాయమా? అన్యాయం అన్యాయం, అని అతని అంతర్వాణి ఘోషించింది. శేషగిరి తనహృదయవీణలోని ప్రతితంతువునూ మ్రోగించి చూచాడు కాని యే రెండింటికీ పొంతన కుదరలేదు. తానిప్పుడు తల్లిదండ్రుల మనస్సు నొవ్వకుండా ఉండడానికి కామేశ్వరిని తెచ్చుకొనేనా తన ఆదర్శం ప్రకారం కుటుంబసౌఖ్యానికి తిలోదకం. లేదని ఆమెను వదలిపెట్టైనా ఉభయుల తల్లిదండ్రులకూ మనఃక్లేశం, ఆపిల్లకు శాశ్వతంగా దుఃఖం. ఈరెండూ నాకేలనని తాను గతించేనా కనిపెంచిన తల్లిదండ్రులకు దరిలేని శోకం. సరే అదిగాదని కామేశ్వరినీ తెచ్చుకొని తాను కోరిన భార్య నింకొకదాన్ని గూడా చేసుకుంటే ఒకకవరలో రెండుకత్తు లిముడవు. ఇంతకంటే అగచాట్లమార్రి బ్రతుకు యింకొకటి లేదు. అదీగాదని ఆవిడ నక్కడ అనాఘ్రాతకుసుమంగానే ఉంచి తానిక్కడ అట్లాగే ఉంటేనో; జన్మమెందుకొచ్చిందో, యౌవనం యెందుకు ప్రసాదింపబడ్డదో, స్త్రీపురుషు లెందుకు సృష్టింపబడ్డారో, జగత్తులో శృంగారమెందుకో, సౌందర్య మెందుకో, చదు వెందుకో సంపాదన యెందుకో, అన్నీ వ్యర్థమేగదా, భార్యలేకపోతే. ఈ విధంగా అంతులేని యోచనలతో తుకతుక ఉడికిపోతున్నది శేషగిరి హృదయం. కాని ఒకటీ తేల్చుకోలేక వ్యథపడుతున్నాడు. ఆరాత్రి భోజనం మానుకున్నాడు. సరిగదా కూరుకన్నమాట అసలే యెఱుగడు.

౬

తెల్లవారేంది మనసు మనస్సులో లేకనే హోటల్కు వెళ్లి నాలుగు మెతుకులు నంజివచ్చి పాఠాలెక్కువగా ఉన్నాయనో పరీక్షల సమయమనో సెలవులు పుట్టవనో వ్రాసి పారేద్దామా, ఈమాటు ఉపద్రవం తప్పితుం దనుకుంటూ కాలేజికి వెళ్లాడు.

అక్కడ ఉండగానే శేషగిరికి తండ్రివద్దనుండి టెలిగ్రామ్ వచ్చింది. "నీవు రెండు ఉత్తరములు వ్రాసినా జబాబీయలేదు. ఏమిటి నీ ఉద్దేశం? నీదగ్గరనుండి రేపు ఉత్తరం రాకపోతే బయలుదేరి వస్తున్నా. మీ మామగారు తొందరపెట్టుతున్నారు" అని అందులో వుంది. ఆతంతివార్త చూచుకొనేటప్పటికి తల తిరిగింది. క్రుంగిపోయినాడు. ఈ అగ్నిపరీక్షలో యెట్లా నెగ్గుతానురా బాబూ అనుకున్నాడు. ఏమైనా సరే ఇక ఉపేక్ష కూడదు. ఎదుటికి వస్తే మరీ మొగమోటం మరీ యిబ్బందీ కాబట్టి యేదో ఒకటి తేల్చి యీపూట టపాలో పారేయడం కర్తవ్యం అనుకున్నాడు, కాని ఆఉత్తరం వ్రాయడానికి కొంచెపు అవకాశంచాలదు. కాబట్టి ఆపూటకు ప్రిన్సిపాల్ దగ్గిర సెలవు తీసుకొని తనరూమ్‌కు వచ్చాడు. కలం కాగితం చేతబట్టుకుని కూర్చున్నాడు. కలం విదిలిస్తే అంచులో సిరా లేదు, సరేనని సిరాబుడ్డీ తెచ్చి సిరాపోసుకోబోతే చెయ్యి వణికి సిరా చేతిమీదా చొక్కామీదా పడ్డది. ఆ చొక్కా విడిచి అవతల పారేసి చెయ్యి గట్టిగా రుద్ది కడుక్కొని మళ్లీ

ఉత్తరం వ్రాయడానికి కూర్చున్నాడు. కాని వ్రాయబోతే గుండె టపటపా కొట్టుకుంది. చేయి వణికి కాగితం క్రిందకు జారింది. ఆ కాగితం మళ్లీ చేతికి దీసుకొని వ్రాయబోతే అదేమో చేయి చచ్చుకొని పోయినట్లయి పటుత్వం దప్పి వ్రాసిన అక్షరాలు అలుక్కుపోయినాయి, కాకితం చెడిపోయింది. ఛీ అని దాన్ని క్రింద పారేసి మరో లెటరు పేపరు అందుకున్నాడు. ఒకదానివెనుక ఒకటిగా యీ అనేకతప్పులు జరిగిన కొద్దీ "నేనేలయింత పిరికిపందనై పోతున్నాను? ఇందులో నా అక్రమం యేమున్నది? ఒక పసివాని భవిష్యం పాడుచేసినవారిని పూజ్యులైతేమాత్రం యెదిరించడానికి యేల భయపడాలి? అనుకూలవతియగు కన్యను చూచుకొని పెండ్లాడడం ప్రతివానికీ న్యాయమైన హక్కు. అట్టి నాహక్కును తాము సంక్రమింపజేసుకొని దుర్వినియోగం జేసిన తల్లిదండ్రులనూ సంఘాన్నీ ధిక్కరించడం న్యాయమే గాని యిందులో అక్రమం యేమున్నది? అని ఈవిధంగా తల్లిదండ్రుల అన్యాయం తలంచగానే శేషగిరి హృదయంలో పౌరుషం ఉద్దీపించింది. రక్తం ఉడుకెక్కింది. కోపం కొండంత బలంగదా! ఎప్పుడైతే కోపం రేకెత్తిందో అప్పుడే శేషగిరికి మనస్సులో గలిగిన జంకూ చేతుల్లో గలిగిన దౌర్బల్యమూ ఒక్కమాఱు హుష్న యెగిరిపోయినాయి. కేవలం మషీరసమును స్రవించే ఆ పూటకలం క్షణంలో తీక్ష్ణతజెందిన యోధుడిచేతి ఆయుధంలాగా అయిపోయింది. ఆ వుద్వేగంతో పరపరా ఒక పెద్ద ఉత్తరం వ్రాసి చప్పున వెళ్లి పోష్టులో పారేసి గదికి చేరాడు.

౭

శేషగిరి వ్రాసిన ఉత్తరం సకాలంలో సుబ్బయ్య దీక్షితులుగారికి చేరింది. నేను బయలుదేరి వస్తున్నానని ఒక్కముక్కతో రావలసిన కొమారుని ఉత్తరం భారమైన కవరుతో రావడంచేత దీక్షితులుగారికి మనస్సులో యెందుకో భారం అనిపించింది. ఆత్రంతో తిప్పుకొని యేమేవ్! నీకుమారుడి దగ్గిరనుంచీ ఉత్తరం వచ్చింది. రమ్మని కేకేసి భార్యను పిలిచి ఆమెవద్ద యిట్లా చదవడం ప్రారంభించాడు.

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన చావలి సుబ్బయ్య దీక్షితులు నాన్నగారికి, తమకుమారుడు శేషగిరి నమస్కరించి వ్రాయునవి. మీరువ్రాసిన రెండుత్తరములును టెలిగ్రామును చేరినవి. కాని మీరు నాకు అక్రమముగా చేసిన వివాహమునకు బద్ధుడను కావలయునా? వలదా? యను నాలోచనలో నుండుటచే మీకు వెంటనే ఉత్తరము వ్రాయుట కాలస్యమైనది. క్షమింప గోరెదను. నాన్నా! కామేశ్వరి నాకు వివాహము చేయబడినదని మీరుచెప్పుటేగాని నాకు గుర్తు లేదు. జ్ఞప్తియందుంచుకొనజాలని యతిబాల్యమున నవ్యక్తులును, క్రీడాసక్తులును నగు నిరువురు బాలబాలికలకు చేయబడిన వివాహము శాస్త్రీయ మెట్లగును? అశాస్త్రీయమగు నీవివాహమునకు యుక్తవయస్సు వచ్చిన తరువాత వధూవరులేల బద్ధులు కావలెను? వివాహము ప్రతిస్త్రీపురుషునకును జన్మహక్కు. అట్టి వైవాహికపు హక్కు తల్లిదండ్రులు దుర్వినియోగముచేసినచో దానికి వధూవరులు బాధ్యులా? సుఖమును చెఱుపుకొనుమనియు జీవితసౌఖ్యమును భగ్నముచేసికొనుమనియు తలిదండ్రులు కట్టిపెట్టిన యననుకూలయగు భార్యతో కలకాల మల్లాడుమనియు నుత్తమోత్తమమైన మనహిందూమతమైనను శాసించుచున్నదా? విద్యాపరిపూర్తియగు వఱకు బ్రాహ్మణునకు వివాహార్హత లేదుగదా. విద్యాభ్యసనకాలమంతయూ పరమపవిత్రమైన బ్రహ్మచర్యమును ప్రతియధ్యేతయూ ననుష్ఠించి తీరవలెనని హిందూమతము స్పష్టముగా విశదీకరింపుచున్నది గదా. విద్యాపరిపూర్తియైన వెనుకనే సమావర్తనము అనగా నేమి? గురునికడ వివాహమున కనుజ్ఞ గొనుటగదా. ఈవిధముగా బ్రహ్మచారియొక్క విధిని హిందూమతము శాసింపుచుండ అక్షరాభ్యాసమే చేయబడని పిల్లలకు హిందూమతము పేర వివాహము జరుపుట హిందూమతము నుల్లంఘించుటయని వేఱే వక్కాణింపబనిలేదు. మన మహర్షుల వివాహవృత్తాంతములు వివాహముయొక్క కాలమును చక్కగా ప్రతిపాదించుచున్నవి. విచారించి చూడుము. వారిలో నొక్కరును అధ్యయనము పూర్తిగాక పెండ్లియాడలేదు. కాని యీగు మతప్రియత్వము

చేతనే మతమును ధిక్కరించితిరి. బిడ్డలయందలి వాత్సల్యముచేతనే వారి భవిష్యమును పాడుచేసితిరి. విచారించి చూచినచో దీని తాత్పర్య మేమనగా మతప్రియత్వము దురభిమానముగాను, బిడ్డలయందలి వాత్సల్యము సర్వాధికారముగాను పరిణమించినది. ఈ అతివ్యాప్తి దోషముచే ఉద్దేశము మంచిది ఆచరణ చెడ్డదియు నైనది. పరంపరాగతాచారముచేత దీనిని మీరు గమనించి యుండరు. అయితే సదుద్దేశముతో మీరుచేసిన యపకారమును సహించుట మీకుమారుడనైన నావిధియే కావచ్చును కాని ఆకామేశ్వరివిషయ మించుక విచారించి చూడుడు. ఆబాలికకు విద్యాసంస్కారము లేదు. నాగరికతయు లేదు. అతిఛాందసమునకును మౌఢ్యమునకును నాలవాలమైన కుటుంబములో పదునారేండ్లు పెరిగి వచ్చిన యామె నాయభిప్రాయముల నామోదించి నా కోరిన విద్యార్జనము నామోదించునని నాకు విశ్వాసము లేదు. న్యాయముగా ఆలుమగ లేకశరీరులు కాన నా శరీరములో సగభాగము కేవలము మొద్దుబారి నిరుపయోగముగా నుండుటకు నామన స్సంగీకరించుటలేదు. సర్వాంగములు సమానమైన వికాసములో నున్నప్పుడే శరీరికి నిజమైన ఆరోగ్యము, ఉల్లాసము, శోభ కాని యిట్టివేవియు నాకు కామేశ్వరివల్ల సమకూరునట్లు గన్పించుటలేదు. కాన నే నామెను భార్యగా గైకొనజాలను. ఇక ఒక్క సంవత్సరమునకు నావిద్య పూర్తియగును. హిందూమతవిధిప్రకారము మప్పుడనురూపగుణాఢ్యయగు కన్యను పరిణయ మాడుదును. ఇది నా దృఢ నిశ్చయము.

అయితే యీనాప్రవర్తనమువలన కామేశ్వరికిని, ఆమెతల్లిదండ్రులకును శాశ్వతదుఃఖమును, మీకు మనఃక్లేశమును గలిగించినవాడ నగుదునని నాకు దెలియును. కేవలము పాలుత్రాగెడి పసిబిడ్డయగు కామేశ్వరిపై మోపబడిన యీవివాహబాధ్యత అక్రమమైనది. నిజమునకామె అవివాహితగా నెన్నదగినది. కాన ఆమె కిప్పుడు తగినవానిని జూచి పునర్వివాహము చేయుట ధర్మముకాదా? నా ఆర్జనలో కొంతభాగ మామెకు యావజ్జీవపర్యంతరి మిచ్చుటకు సంసిద్ధుడను.

ప్రపంచములో యేదేశీయులును నిట్టి శిశుకల్యాణములు జరుపరు. తమబిడ్డల జీవితమునుపాడు చేయరు. ఆచారదాసులు హైందవులగుతల్లిదండ్రులకే యిది చెల్లినది. ఇది పాశ్చాత్యనాగరికతాసంసర్గదోషమని మీరూహింపవచ్చును. కాని యిది హిందూమతమునకే విరుద్ధమని ముందే విన్నవించితినిగదా. కాన యుత్తమమైన హిందూమతాభిమానినగు నేను కేవల మాచారోన్మాదముచే చేయబడిన యీవివాహము నుల్లంఘించుట ధర్మేతరము గాదని పూర్ణముగా విశ్వసించుచున్నాను. కాన నన్నొప్పించుటకై యనవసరముగా తంటాలు పడవద్దు. రైలుఖర్చులు దండుగచేసికొని యిక్కడకు రావలదు. లాభము లేదు. నే నిప్పుడీవివాహధర్మము నుల్లంఘించుట యన్యాయముగా నాదైన దుర్వినియోగము చేయబడిన హక్కును రాబట్టుకొనుటేగాని మరేమియుగాదు.

తండ్రీ!

చ. "కులజయు నిర్మలాంగి యను
కూలయు నయ్యయి విద్యలందు గా
శలమతి యుక్త సుశీల గుణ
సన్నుతువాలును నైనయట్టి కో
మలి లభియించినంగన స
మంజసమౌను గృహస్థధర్మ మ
ట్లలవడకుండెనే నిరక గృ
హస్థునిపాటులు చెప్పశక్యమే."

ప్రియకుమారుడు,
శేషగిరి.

అని యీరీతిగా ఉన్న కొడుకు ఉత్తరం చూచి తల్లిదండ్రులు నివ్వెఱపోయినారు. వినయవిధేయతలుగలవాడున్నూ, విద్యాధికుడున్నూ అయిన కుమారుడు తాము చేసినపనిని యిట్లా ధిక్కరిస్తాడనీ తమచేతిలో పుల్లతోనే తమకండ్లు పొడుస్తాడనీ, వారెప్పుడూ అనుకోలేదు. శేషగిరి సాహసంచూస్తే సుబ్బయ్యదీక్షితులుకు చాలా కోపం వచ్చింది. వైదికమాలఁ చదువు చెప్పించిన దోషం యిదే అనుకున్నాడు. కాని పాశ్చాత్యనాగరికతాధోరణి లేకుండా హిందూధర్మానుసారం

గానే శేషగిరి వాదించినవిధం క్రోధంలోనే కొంత పరుషతను తోపింపజేసింది దీక్షితులుకు. అంత చేసినవానికి వివాహం చేయడానికి తనకు హక్కు లేదనుకున్నాడు. కాని తండ్రినిగదా, అష్టకష్టాలు పడి విద్యాబుద్ధులు చెప్పించినవాడినిగదా తప్పేఅనుకో నామాట కొంత యెందుకు పాటించగూడదూ అనే శేషగిరిమీద ఆయనకొచ్చిన కోపం కాని ఏమి కోప మొచ్చినా యేమిచేస్తారు? శేషగిరిని యిక ఒప్పించడం వట్టిదీ అని వారిద్దరికీ బాగా దృఢపడిపోయింది. అయితే ఆపిల్లగతేమిటి? తానైతే యింకోదాన్ని పెండ్లాడుతాడనుకో ఆపిల్ల యేం జేస్తుంది? మతం మంటగలిసిపోతుందని యేడాది పిల్లకు పెండ్లి చేసిన ఆఛాందసుడు పేరయ్యశాస్త్రి పిల్లకు మళ్లీ పెండ్లి జేస్తాడా? చేయడు. అయితే ఆపిల్ల ఉసూరుమనిపోదూ? ఏమి చేద్దామంటే యేమి చేద్దామని యిద్దరూ తలపట్లు పట్టుకున్నారు. వాడిదగ్గరికి పోయి కడుపూ గడ్డం పట్టుకొని బతిమలాడదామా అనుకున్నారు. లాభం లేదనితమరే అక్షతలు వేసుకున్నారు. దేశకాలపాత్రములు గుర్తించకుండా పెండ్లి చేయడం పొరబాటనుకున్నారు. అయితే యిపుడు చేయవలసినపనేమిటి? వాళ్లక్కడ పనిపాటలన్నీ చేసుకొని గోడలకు సున్నమూ ద్వారములకు తోరణాలూ కట్టుకొని మనకోసం యెదురుచూస్తుంటారే! అయ్యో ఈ వర్తమానం వారికెట్లా తెలియజేస్తాము? తెలుపక చేసేదేమిటి. వాళ్లు మనలను నమ్మి ఉంటారు గదా. ఈ విధంగా ఆరోజల్లా యోచించి యోచించి శేషగిరి ఉత్తరం వారికి పంపివేద్దామని నిశ్చయించి ఒకమనిషి చేత పంపించారు.

## ౮

వియ్యాలవారు వస్తారనుకునే వేళకు ఉత్తరం చేరింది. పేరయ్యశాస్త్రి ఆఉత్తరం చూచుకొని కొయ్యైపోయినాడు. కలకల్లాడుతూ శుభం కోరుతూ ఉండే కొంప క్షణంలో ఆలగోడు బాలగోడైపోయింది. తల్లీదండ్రీ, వచ్చినచుట్టాలూ, అందఱూ కామేశ్వరిని ముందుపెట్టుకొని యేడవడం సాగించారు. విన్నవారూ కన్నవారూ శేషగిరిని చెడదిట్టారు. దేశకాలాలు గుర్తించకుండా యేడాదిపిల్లకు పెండ్లిచేసిన పాపాత్ముడను తాననీ తన పాపానికి ప్రాయశ్చిత్తం లేదనీ పేరిశాస్త్రి పెద్దగా యేడ్చాడు. తానుచేసిన పాపానికి కామేశ్వరిని గంటిచేయడం హత్యాతుల్యమని ఆయనకు తోచింది. కాబట్టి ఆదుఃఖంలో మొఖాన విభూతిరేఖలూ ధోవతికి పింజెలూ తీర్చుండలో కుశలుడైనవాడూ, బ్రాహ్మణార్థాలకు వెనుదీయనివాడూ, శుభాశుభకర్మలు నిరాఘాటంగా జరుపగలవాడూ అయిన ఒకశ్రోత్రియ బ్రహ్మచారిని తీసుకవచ్చి వాడిమొఖాన గొట్టినట్టు కామేశ్వరికిచ్చి పెండ్లిచేద్దామా అనుకొన్నాడు. కాని వేదవేదాంగపారంగతులూ, అగ్నిష్టోమాది నానావిధాధ్వరకర్తలూ, పరమశ్రోత్రియులూనై ఒకేవిధంగా కీర్తిగన్న తనవంశానికి నేటికి కళంకం కలిగించడానికి పేరిశాస్త్రిమనస్సొప్పలేదు. పాపం, బాల్యవివాహ పాపఫలమునకు గుఱియై కామేశ్వరి జీవితమట్లా నిరర్థకమై పోయింది.